ప్రజాశక్తి
ఆదివారం 30 ఏప్రిల్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

త్వరలో బందరు పోర్టుకు శంకుస్థాపన

పైలాన్ స్థల పరిశీలనకు ఏర్పాట్లు ● బీచ్ రోడ్డులో లేబర్ క్యాంపు ● పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వద్ద అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం

ప్రజాశక్తి – కృష్ణాప్రతినిధి

బందరు పోర్టు నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారైంది. మే 22వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేసి పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తారని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) శనివారం వెల్లడించారు. బందరు ఎంపి బాలశౌరి, ఎంఎల్‌ఏ పేర్ని వెంకట్రామయ్య(నాని) పోర్టు నిర్మాణ పనులపై గతంలో విడివిడిగా మీడియాకు సమాచారం ఇచ్చారు. తాజాగా ఈ ఇద్దరు నేతలు లేకుండానే గుడివాడలో కొడాలి నాని పోర్టు నిర్మాణ పనులకు సంబంధించిన తేదీని వెల్లడిస్తూ శనివారం ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ నేపథ్యంలో మేలో పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించే నిమిత్తం ముఖ్యమంత్రి ఆవిష్కరించే పైలాన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని జిల్లా యంత్రాంగం పరిశీలిస్తోంది. సోమ, మంగళవారాల్లో జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పైలాన్ నిర్మాణ స్థలాన్ని ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంపిడిసిఎల్), అధికారులు, పోర్టు కన్సల్టెన్సీ సంస్థ రైట్ ప్రతినిధులు, కాంట్రాక్టు సంస్థ మెగా ఇంజినీరింగ్ ప్రతినిధుల అవసరాలకుగాను పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వద్ద తాత్కాలిక కార్యాలయాన్ని సిద్ధం చేశారు. బీచ్‌కు వెళ్లే రోడ్డు కుడివైపున కన్‌స్ట్రక్షన్ లేబర్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు.

పోర్టు నిర్మాణ ప్రదేశం

రెండు వే బ్రిడ్జిలు, టెస్టింగ్ ఫైల్స్

మంగినపూడి బీచ్ రోడ్డు నుంచి పోర్టు నిర్మాణ ప్రాంతానికి అనుసంధానంగా రహదారి పనులు ఇప్పటికే సాగుతున్నాయి. ఈ రహదారికి ఇరువైపులా రెండు వే బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు.

నిర్మాణానికి అవసరమైన ఇనుము, కంకర, సిమెంట్ తదితరాలు తరలించే క్రమంలో దిగుమతికి ముందు, తర్వాత రవాణా వాహనాల బరువులను పరిశీలించడానికి వీలుగా ఈ వే బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. పనులు ప్రారంభానికి ముందుగా కాంట్రాక్టు సంస్థ మెగా ఇంజినీరింగ్ సంస్థ టెస్టింగ్ ఫైల్స్ పరీక్షలను నిర్వహిస్తోంది.

భారీ వర్షం

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లాలో శనివారం గన్నవరంతోపాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటలకు ఆకాశం మేఘావృతమై గంటసేపు భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. గంటపాటు ఇళ్లలో నుంచి జనాలు బయటికి రాలేదు. ఎండతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి వాన కురవడంతో చల్లబడింది. భారీ వర్షం వల్ల కేసరపల్లి శివారు వెంకట నరసింహపురం ప్రాంతంలోని పల్లపు ప్రదేశాల్లోకి నీరు చేరింది. పలుచోట్ల ఇళ్లు నీట మునిగాయి. వేసవికాలంలో ఇంత పెద్ద వర్షం ఇంతకుముందు ఎప్పుడూ కురవలేదని రైతులు చెబుతున్నారున. పొలాల్లో ఆరబోసిన మిర్చి తడిసింది. బాపులపాడు ఎంజి నగర్‌లో ఇళ్లల్లోకి నీరు చేరింది. ఈ నీటిని తోడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. అలాగే ఉంగుటూరు మండలం పెద్దఅవుట పల్లి గ్రామం సుగాలిపేటలోకి వర్షం నీరు చేరింది. లంబాడి పేటలో ఇళ్లల్లోకి వచ్చే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పూనుకొని డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిపిఎం ఉంగుటూరు మండల, పెద్ద ఆవుటపల్లి గ్రామ నాయకులు డిమాండ్ చేశారు.

అన్నీ ఆమోదం

సింగిల్ టెండరైనా ఓకే ! ● విఎంసి స్థాయీ సంఘం తీర్మానం
● నూతన కార్యాలయ పనులకు రూ.49.80 లక్షలకు ఆమోదం
● సాధారణ నిధుల నుండి కేటాయింపు

ప్రజాశక్తి-విజయవాడ : నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన కార్యాలయ భవనం ఎయిర్ కండీషనర్లు, వాటికి అవసరమైన వస్తువుల ఏర్పాటుకు అవసరమైన రూ.49.80 లక్షల అంచనా వ్యయాన్ని సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి పరిపాలనా పరమైన అనుమతిని మంజూరు చేస్తూ విఎంసి స్థాయీ సంఘం తీర్మానించింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం స్థాయీ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 18 అంశాలకు గాను ఒకటి రెండు అంశాలు మినహా అన్నీ అంశాలూ ఆమోదం పొందాయి. పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఎక్కువ అంశాలు ఈ అజెండాలో చోటుచేసుకోవడం గమనార్హం. సి+జి+9 విఎంసి నూతన కార్యాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50.96 కోట్లలో రూ.2 కోట్ల అంచనాతో పనులను పున:ప్రారంభించి మెస్సర్స్ సితారాం అండ్ కో సంస్థ రెండు, మూడో అంతస్తులకు పిల్లర్లు, స్లాబ్‌లను పూర్తి చేయడం తెలిసిందే. వీటికి సంబంధించి బయటి గోడలు, అధికారులు, ఉద్యోగుల

(మిగతా 6లో)

స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కెడిసిసిబి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

రూ.10 వేల కోట్లకు కెడిసిసిబి టర్నోవర్

చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు వెల్లడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పదివేల కోట్ల వ్యాపారానికి చేరుకుని అతిపెద్ద మైలు రాయిని దాటిందని, దేశంలోని ఐదో అతిపెద్ద డిసిసిబిగా గుర్తింపు పొందిందని కష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం బ్యాంకు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తూ సమిష్టి కషితో నేడు ఈస్థాయి అభివద్ధిని సాధించినట్లు చెప్పారు. గత ఏడాది రూ.34 కోట్ల ఆదాయం రాగా, 2022- 23 ఆర్థిక సంవత్సరంలో రూ.42 కోట్ల నికర లాభాన్ని సాధించినట్లు చెప్పారు. తాము బాధ్యతలు చేపట్టే నాటికి రూ.7వేల కోట్ల టర్నోవర్ ఉన్న కష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ గత 20 నెలల కాలంలో రూ.10 వేల కోట్లకు వ్యాపారాన్ని పెంచగలిగామని

(మిగతా 6లో)

మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని

జాతీయ రహదారిపై నిరసన

ప్రజాశక్తి - మైలవరం : మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పివి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దళారులు కుమ్మక్కై మొక్కజొన్న ధరలను ఒక్కసారిగా తగ్గించి వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రారంభంలో క్వింటాకు రూ.2300 ధర ఉండగా, దళారుల రంగ ప్రవేశంతో రూ.1500 కి పడిపోయిందన్నారు. రోజుల తరబడి మొక్కజొన్నలు యార్డులో నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిఐ మోహన్ రెడ్డి నిరసనకారుల వద్దకు చేరుకొని రైతు సంఘం నాయకులతో మాట్లాడి విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఎఎంసిలో ఆరబోసిన మొక్కజొన్న రాశులను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర్, రైతు సంఘం నాయకులు ఇసాక్, పత్తిపాటి నాగేశ్వరరావు, న్యాయవాది రావురి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు తదితరులు

బంగారం చోరీ కేసులో అరెస్టు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : కొండపల్లిలో ఈనెల 26న బంగారు దుకాణంలో జరిగిన బంగారం దొంగతనం చోరీకేసును ఇబ్రహీంపట్నం పోలీసులు చాకచక్యంగా చేధించారు. సిఐ శ్రీను ఆధ్వర్యంలో ఈ కేసును త్వరితగతిన కేసును చేధించారు. సిసిపుటేజ్‌తో దర్యాప్తు చేపట్టిన పోలీసులు రోజుల వ్యవధిలోనే నిందుతులను అదుపులోకి తీసుకున్నారు. అసలు బంగారం స్థానంలో నకిలీ బంగారు నగలు ఉంచి షాపు యజమానిని బురిడీ కొట్టించిన మహిళలను అదుపులోకి తీసుకున్నారు ఇబ్రహీంపట్నం ఫెర్రీడౌన్‌చేపల మార్కెట్ వద్ద అనుమానితులైన ఇద్దరు మహిళలను అదుపులోనికి తీసుకుని విచారించి వారి వద్దనుండి సుమారు 9 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాదీనం చేసుకుని అరెస్టు చేశారు.

ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ప్లాస్టిక్ నిషేదంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ సిహెచ్. మల్లేశ్వరరావు పట్టణంలోని పలు హెూటళ్లను శానిటరీ ఇన్స్పెక్టర్ తో తనిఖీలు చేశారు. ప్రభుత్వం సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడుకం రద్దు చేసిందని,120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా రద్దు చేసిందన్నారు. కావున జగ్గయ్యపేట పట్టణ వర్తక, వాణిజ్య సముదాయల యజమానులు ప్రభుత్వ నియమ నిబందనలను పాటించాలని, లేకపోతే జరిమానాతోపాటు సంబంధిత షాపు వ్యాపార లైసెన్స్‌ను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజారోగ్య దష్ట్యా, పర్యావరణ పరిరక్షణ దష్ట్యా షాపు యజమానులు క్లాత్ లేదా జ్యూట్ బ్యాగులు వినియోగించి ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలన్నారు.

కెబిఎన్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మే ఒకటో తేదీ నుంచి ఉచితంగా ఓరియంటేషన్ తరగతులను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తెలిపారు. ఉన్నత పాఠశాల్లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మే ఒకటి నుంచి ఆరో తేదీ వరకూ ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకూ తరగతులు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సహా అన్ని రకాల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం లేదని పేర్కొన్నారు. తరగతుల్లో నూతన విద్యావిధానం ప్రతిపాదిస్తున్న అకడమిక్ ప్రమాణాలకు అనుగుణంగా నూతన బోధన పద్ధతులు, ప్రశ్న పత్రాల తయారీ, మూల్యాంకన విధానాలు, కో కరికులర్ యాక్టివిటీస్, క్రాస్ కరికులర్ అప్రోచ్, ప్లే మేథడ్స్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొంద దలుచుకున్న ఉపాధ్యాయులు కళాశాల కార్యాలయంలో నేరుగా లేదా 9032044115 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐఐటి జెఇఇ మెయిన్స్ 2023లో శ్రీ చైతన్య ఐఐటి విజయవాడ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుతమైన విజయాలు సాధించారని విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఎజిఎం మురళీకృష్ణ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలలో ప్రతిభ కనపరచిన విద్యార్థుల అభినందన సభ శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు 10వ ర్యాంకుతో పాటు 100లోపు 23 ర్యాంకులు శ్రీ చైతన్య కైవశం చేసుకుని నెంబర్‌వన్ స్థానంలో ఉందని తెలిపారు. అన్ని కేటగిరిలోనూ శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఎగ్జిక్యూటివ్ డీన్స్ పి.మురళీరావు, కె.శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకరం

ప్రజాశక్తి-వత్సవాయి : సిపిఎం, సిపిఐ ప్రచార బేరిలో భాగంగా శనివారం మండలంలోని కన్నె వీడు గ్రామంలో సిపిఎం పార్టీఆధ్వర్యంలో ప్రచార బేరి నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిరుమామిళ్ల హనుమంతరావు, సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతీ వ్యక్తి గొంతెత్తికే ంద్రప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయవలసిన సమయం ఆసన్నమైందన్నారు. మనందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకుల్ని, మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని, ఆఖరికి మనందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోన్నారన్నారు. మోడీ అండదండలతో ఆదానీ ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్ల గొట్టాడో హిండెర్గ్ నివేదిక బట్టబయలు చేసిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో , కరిసే రత్నబాబు, వివిధ సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

అలాగే సిపిఎం, సిపిఐ ప్రచార భేరీ లో భాగంగా వత్సవాయి మండల కేంద్రంలో ఉపాధి హామీ వ్యవసాయ కూలీలతో సిపిఎం మండల కమిటీ సభ్యులు బి రాము మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పాలకుల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారని, మతవిద్వేషాలను రెచ్చగొడుతూ వారి పబ్బం గడుపుకుంటున్నారని ప్రభుత్వ రంగ సంస్థలైన ప్రజా ఆస్తులను తమ మిత్రులైన ఆదాని అంబానీ, ఇతర కార్పొరేట్లకు అప్పనంగాదోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వై. వెంకటరత్నం, వ్యవసాయ కూలీలు అప్పారావు, లక్ష్మణ్, తులసమ్మ, పాపారావు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

'మా నమ్మకం నువ్వే జగన్' బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - భవానీపురం : రాష్ట్ర ప్రభుత్వ పథకాల విజయోత్సవంతో వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ నాయకత్వంలో యువకులు బైక్ ర్యాలీతో నగరంలో సందడి చేశారు. ఆకుల శ్రీనివాస్ నాయకత్వంలో దాదాపు 500 బైకులతో యువకులు జై జగన్ అంటూ నగర వీధుల్లో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నా మీరే మా నమ్మకం- మీరే మా భవిష్యత్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి నలబై లక్షల కుటుంబాలు ఒకే మాటగా జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలిచినందుకు విజయోస్తవ బైక్ ర్యాలీ విజయవాడలో నిర్వహించారు. ముందుగా భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో నగరంలోని మూడు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన షుమారు 250 మంది ఆకుల శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షులు, పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్య లక్ష్మి ,తూర్పు నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్, కార్పొరేటర్లు హర్షద్, యలకల చలపతిరావు, యరడ్ల అంజనేయ రెడ్డి, షేక్ ఇర్ఫాన్, బి.కోటి రెడ్డి తదితరులు కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని ఆహ్వానించారు. ఆనంతరం ఆకుల శ్రీనివాస కుమార్ నాయకత్వంలో జిల్లా వైఎస్సార్ పార్టీ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి రథం సెంటర్ మీదగా కంట్రోల్ రూం దగ్గరకు చేరుకుని వైఎస్సార్ విగ్రహంకు,అంబేత్కర్ విగ్రహంకు పూల దండలు వేసి పూజాకార్య క్రమం నిర్వ హించారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

ప్రజాశక్తి -తిరువూరు : కిడ్నీ వ్యాధితో మరణించిన తలపులు శ్రీను కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని తహశీల్దార్ సురేష్‌బాబు శనివారం స్థానిక తన కార్యాలయంలో అందజేశారు. మండలంలోని అంజనే యపురం గ్రామానికి చెందిన శ్రీను కిడ్ని వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటూ ఇటీవల మతి చెందాడు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేయగా సర్పంచ్ కుటుంబ రావు కలిసి మతుడు భార్య రాణికి అందజేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గంధం పుల్లయ్య, విఆర్వో గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెట్లకంపల తొలగింపు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో విజయవాడ - నందిగామ ప్రదానరహదారికి ఇరువైపులా కంప చెట్లు, చెత్తా చెదారం తొలగించారు. స్తానిక చెరువు కట్ట వద్ద నుండి మార్కెట్ యార్డు వరకు రోడ్డు కు రెండు పక్కలా కంప చెట్లు పెరిగి మార్జిన్ కనబడటం లేదు. దీనికి తోడు చెత్తా చెదారం పేరుకు పోయింది. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది శని రోడ్డు కు ఇరు ప్రక్కలా ముళ్ళ పొందలు తొలగించారు. మార్జిన్ పై పేరుకు పోయిన చెత్తా చెదారం తొలగించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీత, కార్యదర్శి కనగాల రవికుమార్ పనులు పర్యవేక్షించారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి -తిరువూరు : విద్యాభివద్ధికి ప్రభుత్వం ఇస్తున్న చేయూత, ఉపాధ్యాయుల బోధనకు తగ్గట్టు తల్లిదండ్రుల సహకారంతోడైతేనే పిల్లలకు నాణ్యమైన విద్య అందు తుందని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఎం. జి.ఆదిలక్ష్మి అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన తల్లి తండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ద వహించాలని సూచించారు. పాఠశాలలో జరిగే సమావేశాలకు హాజరు కావాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రాంప్రదీప్, డి.సు దర్శన్, బి.సాంబశివరావు, ఎ.వెంకటే శ్వర్లు,బి.రామాచారి, బి.రాంబాబు, వై.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇటీవల భౌతికశాస్త్రం బోధించడానికి డిప్యూటేషన్ పై వచ్చిన పి.శోభారాణిని ఘనంగా సన్మానిం చారు.

దాడులపై వెలంపల్లి స్పందించకపోవడం దారుణం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆర్యవైశ్య ద్రోహి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి అని, 37 మంది ఆర్యవైశ్యులపై వైసీపీ పాలనలో దాడులు జరిగినా వెలంపల్లి స్పందించలేదని జనసేన పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ మండిపడ్డారు. పోతిన వెంకట మహేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం 20 వ రోజు కార్యక్రమం 39వ డివిజన్ అధ్యక్షులు ఏలూరి సాయి శరత్ ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల సెంటర్ రామమందిరం వద్దనుండి ప్రారంభించి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జనసేన 39 వ డివిజన్ అధ్యక్షులు ఏలూరి సాయిశరత్, ఆకుల రవిశంకర్, ,కొరగంజి వెంకటరమణ, మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి సురేష్ , తమ్మిన లీలా కరుణాకర్,జెల్లీ రమేష్,బొమ్ము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు : ఎంఇఒ

ప్రజాశక్తి- నందిగామ : విద్య సమాజంలో మానవ మనుగడకు దోహదపడుతుందని నందిగామ మండల విద్యాశాఖ అధికారి బాలాజీ పేర్కొన్నారు. శనివారం వివేకానంద విద్యానికేతన్ స్కూల్ వార్షికోత్సవం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ , డోలాస్ ఫ్యామిలీ ట్రస్ట్ డాక్టర్ పగిడిపల్లి దేవ సహాయం, దిశా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కన్నెగంటి సజ్జన్ రావు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు క్రీడలలో గెలుపొందిన వారికి ఎంఈఓ బహుమతులు ప్రధానం చేశారుచేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెలంపల్లి

రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా 38వ చిల్డ్రన్స్ ఫెస్ట్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చిట్టినగర్ కె.ఎల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ 38వ చిల్డ్రన్స్ ఫెస్ట్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావు ఆధ్వర్యంలో జరిగిన చిల్డ్రన్స్ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అతి తక్కువ ఫీజులతో గత 39 సంవత్సరాలుగా అద్భుతమైన విద్యా ప్రమాణాలతో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్. శివరాంప్రసాద్, వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్ షేక్ షరీన్ బేగం, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, విటిపిఎస్ విశ్రాంత అధికారి రాధాకృష్ణమూర్తి, పారిశ్రామికవేత్త చింతలపూడి సత్యనారాయణ, విశాఖపట్నంకు చెందిన నాగోతి అప్పలరాజు, కె. రుణుకాదేవి పాల్గొన్నారు.

దళిత నాయకుల పేర్లు విస్మరించడం తగదు

ప్రజాశక్తి -నందిగామ : దళితులకు నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు , ఎమ్మెల్సీ మ్మొండితోక అరుణ్ కుమార్ తీరని అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్ల శ్యామ్ విమర్శించారు. శనివారం ఉదయం నందిగామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నందిగామ పట్టణంలో రోడ్ల విస్తరణకు దళిత నాయకులు పేర్లు విస్మరించారని ,తక్షణమే అంబేద్కర్ జగజ్జనరావు పేర్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, పెసరవెల్లి శ్యాము ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు సంఘ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వర్క్‌షాపు సీడబ్ల్యూఎం ఎస్ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భం గా సంఘ్ కార్యదర్శి గద్దాసురేష్ మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత దృష్టా కార్మికుల దాహార్తి తీర్చేం దుకు తాగునీరు ప్రతి శనివారం మజ్జిక పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గత 20సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ సిఎంఈ రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్ఎంయూ సెక్రటరీ నాగేశ్వరరావు చైర్మన్ సుబ్బారెడ్డి ఓబిసీ సెక్రటరీ ఎల్ఎస్ ఆర్యేప్రసాద్ చైర్మన్ ప్రసాద్ ఎస్సీ అండ్ ఎస్టీ ఆసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్ సం ఘ్ బ్రాంచి అధ్యక్షులు పామర్తి శివనాగేశ్వరరావు వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్‌రాజు కోశాధికారి జికె డి ఆంజనేయులు పాల్గొన్నారు.

బిజెపికి చరమగీతం పాడండి : సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో భాగంగా శనివారంనాడు పలుచోట్ల సభలు జరిగాయి.

గుడివాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి.తాతయ్య కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ఏఐటియుసి నాయకులు దుంపల వెంకటనరసింహారావు ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ విధనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార భేరీ సభను నిర్వహించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబుతో కలసి జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాతయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సత్యనారాయణ, గుడిపూడి బాబురావు, బి,నాగరాజు ఎం.పద్మారావు, ఎం.సత్యనారాయణ, గౌరీనాయుడు, జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ (కృష్ణా) : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం సర్కిల్‌పేటలో ఐదో రోజు శనివారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్రజా నిరంకుశ విధానాలను ఖండిస్తూ, ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుటకు ప్రజలందరూ ఐక్యంగా పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, పార్టీ నాయకులు కే.శర్మ, ఎండి యునస్, ఆనంద్ బెనర్జీ, సిపిఐ మచిలీపట్నం నియోజకవర్గం కార్యదర్శి లింగం పిలిఫ్, నాయకులు వై.ఈశ్వరరావు, మహిళా సమితి జిల్లా నాయకులు బడుగు రత్నకుమారి, లక్ష్మణరావు, బిల్డింగ్ యూనియన్ నాయకులు బి.నాని, కోటయ్య తదితరులు పాల్గొనారు.

పామర్రు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద చర్యలను అందరూ వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పామర్రు చాట్లవానిపురంలో శనివారం నాడు సాయంత్రం జరిగిన ప్రచార బేరి కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మాదల వెంకటేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఈ విషయమై ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ ఆగడాలు, అరాచకాలు, దుర్మార్గపు చర్యలను నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఒడుగు గంగాధర్ ప్రసాద్, కె.నాగభూషణం, ముల్లపూడి విల్సన్, చాట్ల శ్రీనివాసరావు, ఆదిశేషు, లక్ష్మణ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో

మచిలీపట్నంలో

గుడివాడలో

మాట్లాడుతున్న ఆర్.రఘు, చిత్రంలో హరిబాబు తదితర నాయకులు

ఆదర్శ కమ్యూనిస్టు వెలగా లక్ష్మణరావు

స్మారక స్థూపం ఆవిష్కరణలో హరిబాబు, రఘు

కంకిపాడు : అమరజీవి, నిస్వార్థ ప్రజా పోరాట యోధుడు వెలగా లక్ష్మణరావు అని సిపిఎం నాయకులు మాగంటి హరిబాబు, ఆర్.రఘు అన్నారు. వెలగా లక్ష్మణరావు స్మారక స్తూపం ఆవిష్కరణ మద్దూరు గ్రామంలోని కట్ట సెంటర్ వద్ద జరిగింది. ముందుగా వెలగా లక్ష్మణరావుతో కలిసి సుదీర్ఘ కాలం ఉద్యమంలో పనిచేసిన హరిబాబు పతాకావిష్కరణ చేశారు, అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వెలగా లక్ష్మణరావు కంకిపాడు ప్రాంతంలో గతంలో వ్యవసాయ కూలీరేట్ల పెంపు పోరాటాల్లో పెద్దఎత్తున పాల్గొన్నారని గుర్తుచేశారు. కోలవెన్ను, ఉప్పులూరు, బొడ్డపాడు, వణుకూరు, మద్దూరు తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, భూ పంపిణీ కోసం పోరాడారని గుర్తుచేశారు. కాసరనేని వారి పాలెం శ్మశాన సమస్యపై పోరాడి సాధించారన్నారు. ఈప్రాంతంలో పార్టీ నిర్మాణం కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఆర్.రఘు మాట్లాడుతూ వెలగా లక్ష్మణరావు స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు, యు.త్రిమూర్తులు, కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, పెనమలూరు మండల కార్యదర్శి షేక్ ఖాసిం, మండల కమిటీ సభ్యులు పోతబత్తిన దుర్గాప్రసాద్, జి.కుమారి, సీనియర్ సభ్యులు పితా నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు వి.శివశంకర్, సిహెచ్ శ్రీహరి, ఎం.చంటిబాబు, వి.జాన్మోజెస్, జే.రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల రథసారథి జగన్ : వైసిపి

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం చిన్నవుటపల్లి గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ఘనంగా గ్రామ కన్వీనర్ కోట వినయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాల మేరకు మా నమ్మకం నువ్వే జగనన్న రెండోరోజు కార్యక్రమంలో భాగంగా చిన్నఅవుటపల్లి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్‌ను అంటించి జగనన్నపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించారు. స్థానిక ప్రజలు చెప్పిన సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని హామీనిచ్చారు. జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదంతో ప్రజలతో మమేకం అవ్వడానికి దోపదపడుతోందన్నారు. రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర సీఎం వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని గ్రామ కన్వీనర్ కోట వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు,సచివాలయం కన్వీనర్లు కాండ్రు రాజశేఖర్, గోళ్ల రంజిత్ కుమార్, వైసిపి కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు పంపిణీచేస్తున్న నాయకులు

19న గుడివాడకు సిఎం రాక : కొడాలి నాని

గుడివాడ : శనివారం స్థానిక 3వ వార్డులో వైసీపీ అధ్వర్యంలో నిర్వహించిన జగనన్న మన భవిష్కత్ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో పలు కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ మే 19న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుడివాడ పర్యటన ఖరారైందన్నారు. అదేరోజు టిడ్కో ప్లాట్‌లను లబ్ధిదారులకు అప్పగించడంతోపాటు, జగనన్న లేఅవుట్‌ను ముఖ్యమంత్రి పరిశీలిస్తారన్నారు. నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి రూ.130 కోట్లతో చేయనున్న వాటర్ వర్క్స్ పనులకు పనులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. గుడివాడ పట్టణంలో 2 వందల కోట్ల అభివద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ : రమేష్ బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చరిత్ర సృష్టించిందని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. శనివారం అవనిగడ్డలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా1.45 కోట్ల కుటుంబాలను కలిసి చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దేశంలో రికార్డు నెలకొల్పిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 1.10 కోట్ల మంది నుంచి మిస్ కాల్స్ వచ్చాయన్నారు. నియోజకవర్గంలో 93 వేలకుగాను 83 వేల కుటుంబాలను కలిసినట్టు చెప్పారు. 78 వేల కుటుంబాల నుంచి మిస్ కాల్స్ వచ్చాయన్నారు. మిగిలిన కుటుంబాలను కలసి ప్రజా సర్వే చేస్తామన్నారు. నియోజకవర్గంలో 77 గ్రామ సచివాలయాలు ఉండగా 55 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తిచేశామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అందిన పథకాలను వివరిస్తుంటే ఇతర పార్టీల లబ్ధిదారులు నిజమేనా అని సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి, అక్రమాలు జరగలేదన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఆందోళన చెందరాదన్నారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పంట కోత సమయంలో రెండు సార్లు వర్షాలు రాగా ఆన్లైన్లో కాకుండా ఆఫ్లైన్లో తడిచిన పంటను రైతులు అమ్ముకున్నారని వీటికి కూడా ఆన్లైన్ అయ్యేలా చూసి రైతుల ఖాతాలకు సొమ్ములు జమ చేయనున్నామని తెలిపారు. దివిసీమ ప్రాంతంలో ఇంకా కుప్ప నూర్పిళ్లు ఉండటం వల్ల ఉన్న అధికారులతో మాట్లాడి మరోసారి ధాన్యం సేకరణ తేదీని పెంచామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ధాన్యానికి అత్యధిక ధర పలికిందన్నారు. వీటిని కూడా రాజకీయాలు చేసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతులకు మేలు చేసే పనులే జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు, సచివాలయాల నియోజకవర్గం కన్వీనర్ మద్ది చిన్న, అవనిగడ్డ, మోపిదేవి సచివాలయ కన్వీనర్లు షేక్ నజీర్ భాష, కోసూరు నాగమల్లేశ్వరరావు, పెదప్రోలు పిఏసిఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న కొడాలి నాని

గుడివాడలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం

గుడివాడ : శనివారం స్థానిక 29వ వార్డులోని బేతవోలులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావి ప్రజలనుండి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గుడివాడ అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శొంఠి రామకృష్ణ, నాయకులు పొలాసి ఉమా, యార్లగడ్డ సుధారాణి, పంద్రాజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం

గ్రామీణ ప్రాంతంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం గన్నవరం సిపిఐ కార్యాలయంలో గన్నవరం నియోజకవర్గ రైతు సంఘం మహాసభ పెద్దు వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చే పరిస్థితులు లేవన్నారు. జిల్లా అధ్యక్షులు వెలగపూడి అజాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కామల ఉమామహేశ్వరరావు, గన్నవరం సిపిఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, గన్నవరం పట్టణ కార్యదర్శి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి పిచ్చియ్య, రిటైర్డ్ ఇంజనీర్ కంభంపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ 2023 ఫలితాల్లో

శారద విద్యాసంస్థల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శనివారం ప్రకటించిన ఐఐటి జెఈఈ మెయిన్స్ 2023 ప్రవేశ పరీక్షా ఫలితాలలో మొగల్రాజపురంలోని శారద విద్యా సంస్థల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అద్భుతమైన ఫలితాలు సాధించారని శారద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు తెలిపారు. మొగల్రాజపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో మంచి మార్కులు సాధించారన్నారు. యు.లిఖిత 9024వ ర్యాంకు, డి.బద్రినాథ్ 916వ ర్యాంకు, జి.తేజస్విని 1024 ర్యాంకు, ఎం.గణేష్ పవన్ గోకుల్ 1296వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే కె.విధాత్రి 1926వ ర్యాంకు, ఎ.లకీర్తన 2302వ ర్యాంకు, జి.షణ్ముఖరెడ్డి 2435వ ర్యాంకు, వి.అభిఘ్నశ్రీ 3322వ ర్యాంకు, వి.కీర్తన 4486వ ర్యాంకు, వై.ఝాన్సీలక్ష్మీ 3686వ ర్యాంకు, సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు జెఇఇ మెయిన్స్ ప్రవేశ పరీక్షల్లో చక్కటి ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. తమ విద్యా సంస్థకు చెందిన 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, సుమారు 350 మందికిపైగా విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఈసందర్భంగా మంచి మార్కులు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులను మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థులనుకళాశాల అడ్వైజర్ ఇ.యస్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జి.వి.రావు అభినందించారు.

శ్రీ శ్రీనివాస గ్రావిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఐఐటి జెఇఇ- 2023 మెయిన్స్ ప్రవేశ పరీక్షా ఫలితాలలో మొగల్రాజ పురంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని సంస్థ చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు తెలిపారు. మొగల్రాజ పురంలోని సంస్థ కార్యాలయంలో ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం సాయంత్రం అభినందించారు. ఈసందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎస్.రాహుల్ కౌషిక్ ఆలిండియా స్థాయిలో 34వ ర్యాంకు, కె.సిద్ధార్థ 597వ ర్యాంకు, మోనాల4ఇ 726వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే 90 శాతం పైన 35 మంది విద్యార్థులు సాధించి ఎన్ఐటిలో సీట్లు సాధించారని పేర్కొన్నారు. శ్రీనివాస గ్రావిటీ విద్యా సంస్థ గత 5 సంవత్సరాల క్రితం ప్రారంభించామని నాటి నుండి ప్రతి ఏటా ఐఐటిలో ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ వద్ద గల అనుభవం, అంకితభావం కల అధ్యాపకుల కృషి వల్లనే మంచి మార్కులు సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో డైరెక్టర్ పరుచూరి నీలిమ, ప్రిన్సిపాల్ వై.ఫణి రాజకుమార్ ఉన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవం మే డే వేడుకలను పని ప్రదేశాల్లో జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సి హెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సుందరయ్య భవన్ లో శనివారం మే డే వేడుకలు జయప్రదం చేయాలని కోరుతూ ఆటో వర్కర్స్, ఆశా వర్కర్స్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్, అంగన్వాడి తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను జయప్రదం చేయాలని సమావేశం సిఐటియు మండల అధ్యక్షులు సుధారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక కార్మిక చట్టాలను కాలరాస్తూ హక్కులను హరిస్తున్నారని, కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్ లను రద్దు చేయాలన్నారు. కార్మిక పోరాటాలు ఉధృతం చేసి పోరాటాల ద్వారానే మోడీ ప్రభుత్వాన్ని గద్దెనించాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలో మేడే వేడుకలు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, సిఐటియు నాయకులు రామనాథం, న్యాయవాది దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి కోటను సందర్శించిన కేంద్రమంత్రి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : కొండపల్లి కోటను శనివారం కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్‌సింగ్‌పటేల్ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా పురాతన చరిత్రకలిగిన కొండపల్లి కోటను ఆయన సందర్శించారు. పర్యటనలో భాగంగా కొండపల్లి కోట చరిత్రను గురించి విశేషాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి పురాతన ఆనవాళ్ళను ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కొండపల్లి కోటను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు.

ఘనంగా అభ్యాస విద్యాలయం వార్షికోత్సవం

- ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : స్థానిక పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో శనివారం అభ్యాస విద్యాలయం వార్షికోత్సవం సందడి ఘనంగా నిర్వహించారు. ఈ సందడి మాత్రం ప్రత్యేకం, భిన్నం. భిన్న భారతీయ రాష్ట్రాల, విభిన్న దేశాల సంప్రదాయ జానపద నత్యాలు, వినసొంపైన లలిత,జనపదగీతాలు, ఆరోగ్యకరమైన హాస్యనాటికల సొగసైన మేళవింపుగా కార్యక్రమం సాగింది. ఒక్కో నత్యానిది ఒక్కో అందం, ఒక్కో ఆహార్యం, తీరైన అలంకరణ, తగినట్టుగా అమరిన అందమైన నగలు, కంఠాభరణాలు, కర్ణాభరణాలు, గాజులు, పాపిడిబిళ్ళలు, వడ్డాణాలు....ఇవన్నీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎల్ కె జీ పిల్లలు సీతాకోక చిలకలై వచ్చిన రెక్కలు, యూ కె జీ చిన్నారులు ఎక్కి వచ్చిన రంగురంగుల గుర్రాలు, డప్పులు, గుడిసెలు, భవనాలు, ఆకాశంలో జింకలబండిలో ఎగిరే సంతాక్లాజ్ లాంటి భారీ సెట్టింగులూ చూపరులను ఆకట్టుకున్నాయి. అత్యంత తక్కువ ఖర్చుతో ఈ అద్భుతాలు సృష్టించడం అన్నది గొప్ప అనుభవమని, ఎన్నో మెళకువలు, నైపుణ్యాలను ఆత్మవిశ్వాసాన్ని పెంచే అద్భుతమైన అవకాశమని ప్రిన్సిపాల్ వై వి కృష్ణ తెలిపారు. అందుకే స్కూల్లోని ప్రతి విద్యార్థి ఏదో ఒక విధంగా ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొంటాడన్నారు.

'చైతన్య' విజయ ప్రభంజనం

ప్రజాశక్తి-నందిగామ : జెఇఇ మెయిన్స్ ఫలితాలలో నందిగామ చైతన్య ఏసి క్యాంపస్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ అమర్ నేని కార్తీక్ అన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ అమరనేని రమేష్ బాబు, అమరనేని కార్తీక్, అమరనేని శాంతి ప్రత్యూష అభినందించారు.

విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులు

'ఎస్ఆర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : జేఈఈ మెయిన్స్ 2023 పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థు లు అద్భుతమైన ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో ఎస్ఆర్ విజయపతాకాన్ని మరోసారి ఎగర వేసినట్లు ఎస్ఆర్ విద్యాసంస్థల రాష్ట్ర జనరల్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. గుంటుపల్లి ఎస్ఆర్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఫలితాల వివరాలు వెల్లడించారు. ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అన్ని కేటగిరిలు కలిపి జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని చెప్పారు. గత 52 సంవత్సరాలుగా పటిష్టమైన ప్రణాళికలతో ప్రతి సంవత్సరం రాష్ట్ర జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డిజిఎం రమణ డీన్ అరవింద్ జోనల్ ఇన్‌చార్జ్ కృష్ణారావు అకడమిక్ ప్రిన్సిపాల్ రాము అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ వీరేష్ గొల్లపూడి బ్రాంచి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హిందూ హైస్కూల్‌లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వన్‌టౌన్ కొత్తపేటలోని ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్లో చదవడం విద్యార్థికి గర్వకారణమని, తాను కూడా అదే స్కూల్లో విద్యనభ్యసించి ఇంతటి వాడినయ్యానని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేట హిందూ హైస్కూల్ ఆంగ్ల మాధ్యమం పాఠశాలను శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత పాఠశాల ఎన్‌సిసి ఎయిర్ వింగ్ సీనియర్ క్యాడెట్ ఎన్. జస్విత ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదవాలని కోరుకుంటున్నారని, అది గమనించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆంగ్ల మాధ్యమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. హిందూ హైస్కూల్ కమిటీ కోశాధికారి గోళ్ళ బాబా విజయకుమార్, కేబీఎన్ కళాశాల కరస్పాండెంట్ తూనుకుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 125 ఏళ్ల హిందూ హైస్కూల్లో కేవలం విద్యకే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో క్రీడల్లోనూ, ఎన్సిసితో పాటు సైన్స్ ఎగ్జిబిషన్ వంటి విభాగాల్లో విద్యార్థులను మేటిగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల కార్యదర్శి కెవిఎల్. మోహనరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల కార్యదర్శి చిట్టా రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భవానీపురం : కబేళా విద్యుత్ ఉపకేంద్రం నందు మరమ్మత్తుల కారణంగా 30వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ కార్య నిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ శనివారం ఒ ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళా నగర్, జోజినగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, సితార సెంటర్, లేబర్ కాలనీ, మిథిలా నగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు , రైతు బజార్ రోడ్డు, లలితా నగర్, మానవ మందిర్ రోడ్డు, టీవీ కష్టారావు వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, కావున వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జాన్‌సైదా కుటుంబాన్ని ఆదుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామలో ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల వల్ల మనస్థాపనకు గురై ఆత్మహత్య చేసుకున్న షేక్ జాన్ సైద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి గోపి నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నందిగామ ఆర్డీవో ఏ రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ షేక్ జాన్ సైదా ఇంటర్మీడియట్ లో ఫెయిల్ అయనని మనస్తాపానికి గురై ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చాలా బాధాకరం అన్నారు. తల్లిదండ్రులు రోజువారీగా కూలిపనులకు వెళ్లి ఆవిద్యార్థిని చదివిస్తున్నారని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావున చనిపోయిన విద్యార్థికి ప్రభుత్వం నుంచి 20లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హుసేన్,మహేష్,వెంకటేష్,చందు, నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత : నందిగామ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి జాన్ సైదా కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావుకు శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినత పత్రం అందజేశారు . గర్భంలో ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి గోపీనాయక్ , హుసేన్ పలువురు విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంఎల్‌ఎకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులు, తల్లిదండ్రులతో మమేకం కావాలి

ఉపాధ్యాయులకు కలెక్టర్ పి.రాజాబాబు సూచన

ప్రజాశక్తి-గన్నవరం

పేరెంట్- టీచర్ -స్టూడెంట్ బంధం విద్యా వికాసానికి తోడ్పడుతుందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో కలిసి ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

నైట్‌వాచ్‌మెన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యాభ్యాసం గురించి ఎప్పటికప్పుడు వారి తరగతి టీచర్‌ను కలుసుకొని వారితో మాట్లాడి వారి విద్యాభ్యాసం గురించి తెలుసుకుని విద్యలో తమ పిల్లలు మెరుగైన విధంగా రాణించటానికి అవసరమైన సలహాలు పొందాలన్నారు. తమ పిల్లలను మోటివేట్ చేయాలన్నారు. ప్రతి టీచర్ ప్రతి పేరెంటుతో మాట్లాడి వారి పిల్లలు ఏ విధంగా చదువుతున్నారు, ఏం చేస్తే ఇంప్రూవ్ అవుతారు, బాగా చదివే విధంగా వారికి అవసరమైన సూచనలు చేయాలని కలెక్టర్ సూచించారు. పేరెంట్ కమిటీల ఏర్పాటు లక్ష్యం నెరవేరే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కషి చేయాలన్నారు. పేరెంట్ కమిటీ సమావేశాలు రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ ఇవ్వాలని డిఇఒకు సూచించారు. పాఠశాలకు నియమించిన రాత్రి కాపలాదారు బెజవాడ నాగేశ్వరరావుకు నియామక పత్రం కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం పాఠశాల కిచెన్ షెడ్ తనిఖీ చేసి పరిశుభ్రత పరిశీలించారు. మెనూలో తయారుచేసిన ఆకుకూర అన్నం, సాంబారు, స్వీట్ చక్ర పొంగలి, ఆహార పదార్థాలను పరిశీలించారు. తొలుత డిఇఒ తహెరా సుల్తానా, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ అనిత కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఉపాధ్యాయులను పరిచయం చేసి పురాతనమైన ఈ పాఠశాలలో చదివిన ఎందరో ఉన్నత స్థాయికి చేరి, ఈ పాఠశాలకు సపోర్టుగా ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 6 నుండి 10 తరగతి వరకు 622 మంది విద్యార్థులు ఉన్నారని, వచ్చే ఏడాది ఈ పాఠశాలలో ఇంటర్ తరగతులు కూడా ఏర్పాటు కానున్నయని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ పద్మావతి, ఎంఇఒ శ్రీనివాస్, తహశీల్దార్ నరసింహారావు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని, ఎంపీటీసీ పి.రంగారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు, సర్పంచ్ నిడమర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లి లేఅవుట్ పరిశీలన

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు శనివారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో జగనన్న లేఔట్ సందర్శించి గృహ నిర్మాణాల ప్రగతి పరిశీలించారు. లబ్ధిదారులను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాట్ ఎలాట్ చేసిన ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకుంటే అంతర్గత రహదారుల అభివృద్ధితోపాటు విద్యుత్తు, నీటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. కేసరపల్లి లేఔట్‌లో మొత్తం 83.12 ఎకరాల్లో 3187 ప్లాట్లు వేసి లబ్ధిదారులకు కేటాయించామన్నారు. 1943 గృహ నిర్మాణాలు ప్రారంభం కాగా ఇప్పటివరకు 1743 గృహాలు బిలో బేస్మెంట్ లెవెల్, 92 బేస్మెంట్ లెవెల్, 10 రూఫ్ లెవెల్, 6 శ్లాబులు పూర్తి, 27 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.71.70 లక్షలు పేమెంట్ చేశామన్నారు. రూ.68.29 లక్షల విలువైన మెటీరియల్ అందజేశామన్నారు. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులలో కేసరపల్లికి చెందిన 823 మంది, గన్నవరానికి చెందిన 641 మందితో పాటు అజ్జంపూడి, అల్లాపురం, బిబి గూడెం, చిక్కవరం, గొల్లనపల్లి, గోపవరపు గూడెం, పురుషోత్తపట్నం గ్రామాలకు చెందిన వారు కూడా ఉన్నారని తెలిపారు. గృహ నిర్మాణాలకు అవసరమైన నీటి సదుపాయం కోసం బోర్‌వెల్ ఏర్పాటుచేశామన్నారు. అంతర్గత రహదారి, వాటర్ పైప్ లైన్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. లేఔట్ కు ప్రధాన రహదారి నుండి అప్రోచ్ రోడ్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేసరపల్లి ప్రధాన గ్రామానికి సమీపంలో కాలువపై బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదన ఉందని తెలిపారు. ఇచ్చిన స్థలంలో ప్రతి ఒక్కరు గృహం నిర్మించుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. తొలుత అధికారులు డ్వామా పీడీ మరియు పిడి హౌసింగ్ జీవీ సూర్యనారాయణ, ఆర్డీవో పద్మావతి, డిపిఓ నాగేశ్వర నాయక్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ రాజు, పంచాయతీరాజ్ ఎస్ఇ తదితర అధికారులు గృహనిర్మాణాల ప్రగతి, లేఔట్ అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, తహశీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై తెలుసుకుంటున్న కలెక్టర్ రాజబాబు

ముడా మాస్టర్‌ప్లాన్‌తో కుట్ర బహిర్గతం : టిడిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కష్ణా)

అది ముడా మాస్టర్ ప్లాన్ కాదనీ, మచిలీపట్నం భూములు వైసీపీ కబంధ హస్తాల్లోకి తీసుకునేకుందుకు వేసిన ప్లాన్ అని తేటతెల్లమవుతుందని టిడిపి కార్పొరేటర్లు ఎద్దేవా చేశారు. మచిలీపట్నం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మచిలీపట్నం ముడ మాస్టర్ ప్లాన్ రూపకల్పన పూర్తిగా మచిలీపట్నం అభివృద్ధి నిరోధక ఎత్తుగడగా కనిపిస్తోందే తప్ప

మాట్లాడుతున్న టిడిపి కార్పొరేటర్లు

ఇందులో ఎక్కడా అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు చేయలేదని విమర్శించారు. మచిలీపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధి పేరుతో రాబోవు 30 సంవత్సరాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించిన వైసీపీ ప్రభుత్వం దోపిడీ ప్లాన్ అని ఇట్టే తెలిసిపోతుందని విమర్శించారు. కనీస పరిజ్ఞానం ఉండి చదువుకున్న ఏ వ్యక్తికైనా మాస్టర్ ప్లాన్ ని చూస్తే ఇది దోపిడీ ప్లాన్ అని ఇట్టే తెలిసిపోతుందన్నారు. వైసిపి నేతల కుట్రను గ్రహించి ముడా ప్లాన్ తిరస్కరించి బందరు భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాళ్లకొట్టు రాము, దేవరపల్లి అనిత, అన్నం ఆనంద్, దిద్దకుంట సుధాకర్ పాల్గొన్నారు.

గన్నవరం సర్పంచ్‌కు అవార్డు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్యకు మహిళా స్నేహపూర్వక అవార్డును జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా

గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్యకు అవార్డును అందజేస్తున్న కలెక్టర్

అందించారు. జాతీయ పంచాయితీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు గుడివాడ ఆర్‌డిఒ పద్మావతి, తహశీల్దార్ నరసింహారావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్స్ సభ్యులు ఎండి గౌసాని, కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కేసరపల్లి కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి

రాజమండ్రి ఎడ్యుకేషనల్ స్పెషల్ రాజమండ్రి వారు గోదావరి టాలెంట్ టెస్ట్‌లో భాగంగా 6 నుండి 10వ

వాసవిని అభినందిస్తున్న కొమ్మారెడ్డి కిశోర్

తరగతి విద్యార్థిని విద్యార్థులకు 'రామాయణం'పై టెస్ట్‌ను నిర్వహించారు. గతేడాది నవంబర్ 11వ తేదీన ఈ పరీక్ష జరిగింది. వాటి ఫలితాలను శుక్రవారంనాడు నిర్వాహకులు వెల్లడించారు. అందులో తమ పాఠశాల విద్యార్థిని పి.వాసవి స్టేట్ మూడో ర్యాంకు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మరెడ్డి కిషోర్ తెలిపారు. ఆమెకి గోల్డ్ మెడల్‌తోపాటుగా రూ.275 నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారని పేర్కొన్నారు. వాసవికి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-మోపిదేవి

మండల కేంద్రమైన మోపిదేవిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో క్రికెట్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. క్రికెట్ క్రీడా పోటీల నిర్వాహకులు మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివ నాగరాజుల అధ్యర్యంలో ఉమ్మడి కష్ణ, గుంటూరు జిల్లాల స్థాయిలో క్రికెట్ టెన్నిస్ బాల్ పోటీలు శనివారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. శనివారం గుడివాడ సమీపంలోని వెంట్రప్రగడ, మోపిదేవి కాలనీ జట్లు తలపడగ మోపిదేవి కాలనీ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెంట్రప్రగడ జట్టు నిర్ణిత 12 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. బ్యాటింగ్ ప్రారంభించిన మోపిదేవి కాలనీ జట్టు 11 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. మోపిదేవి కాలనీ జట్టుకు చెందిన నరేంద్ర అత్యధికంగా 46 పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు. రెండవ మ్యాచ్ అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ, బాపట్ల జిల్లా మూలగుంట జట్లు తలపడగా, పులిగడ్డ జట్టు గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన పులిగడ్డ జట్టు నిర్ణిత 12 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. మూలగుంట జట్టు 12 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 77 పరుగులు మాత్రమే చేయగలిగింది. పులిగడ్డ జట్టుకు చెందిన అంజి అత్యధికంగా 63 పరుగులు చేయడంతో, నిర్వాహకులు రంగిశెట్టి శ్రీనివాసరావు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందించారు.

గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

వైసిపి నాయకుడు మద్దాల మృతి

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మండలంలోని పెద్ద తుమ్మిడి పంచాయతీ బండ్ల గూడెం గ్రామంలో రిటైర్డ్ ఏఎస్ఐ, గ్రామ వైసిపి సీనియర్ నాయకులు మద్దాల లక్ష్మీనారాయణ శనివారం మరణించారు. ఆయన భౌతికకాయాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, బంటుమిల్లి ఎంపీపీ వెలివిల చిన్నబాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, మట్ట నాగబాబు, మద్దాల నరేష్, మలిశెట్టి రాజబాబు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

వైసిపి నాయకుడు మద్దాల లక్ష్మీనారాయణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్

పిన్నమనేని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పెదపారుపూడి

జిల్లా, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఎంతో అపారమైన రాజకీయ చరిత్ర కలిగిన వ్యక్తి పిన్నమనేని కోటేశ్వరరావు అని పలువురు కొనియాడారు. కోటేశ్వరరావు సతీమణి పిన్నమనేని సరోజినీదేవి (రాజమ్మ) ఇటీవల అనారోగ్యం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఏపీ అరుంధతీయ బంధు సంక్షేమ సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు పెదపూడి కాంతారావు, పెదపారుపూడి మండల విలేకరుల సంఘం అధ్యక్షుడు నత్తా భూషణ్ కుమార్ శనివారం రుద్రపాక గ్రామానికి వెళ్లి పిన్నమనేని కోటేశ్వరరావు, రాజమ్మ రాజమ్మల తనయుడు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావును పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పిన్నమనేని వెంకటేశ్వరరావుకు పరామర్శ

మేడేకు నగరం ముస్తాబు

ప్రజాశక్తి-విజయవాడ : ప్రపంచ కార్మిక దీక్షా దినం మే డేకు విజయవాడ నగరంలో కార్మికవర్గం, కార్మిక సంఘాలు సన్నద్ధమవుతున్నాయి. పని ప్రదేశాలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలన్నింటినీ అరుణ తోరణాలు, జెండాలతో ముస్తాబు చేస్తున్నారు. వాడవాడలా జెండావిష్కరణలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈదిశగా అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన పూర్ణానందంపేటలోని వెహికల్ డిపోలో మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో యూనియన్ జెండాలు, తోరణాలతో ఆకర్షణీయంగా కార్మికులు ముస్తాబు చేస్తున్నారు. మే డే రోజు వెహికల్ డిపోలో పనిచేస్తున్న కార్మికులందరికీ భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు.

గుత్తేదారులకు త్వరలో బిల్లులు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : గుత్తేదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, జగనన్న హౌసింగ్ కాలనీల్లో నీటి సరఫరా పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.5.65 కోట్ల రూపాయలను త్వరలో చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. జగనన్న కాలనీల్లో నీటి సరఫరా పనులపై శనివారం ఆయన తన కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా అధికారులు, గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నేరవేర్చాలనే లక్ష్యంతో జగనన్న గృహ నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. ఎన్నడు లేని విధంగా జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి పేదవానికీ జగనన్న కాలనీలలో గృహాలను మంజూరు చేసి త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్న దానిలో తాగునీరు, విద్యుత్, రహదారులు ప్రధానమైనవి అన్నారు. జగనన్న కాలనీల్లోని 446 లేఅవుట్లలో తాగునీటి సరఫరా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.13528.39 లక్షలు మంజూరు చేసిందన్నారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 150 కాలనీల్లో నీటి సరఫరాకు కాలనీల జాబితాను సమర్పిస్తామన్నారు. ఇప్పటివరకు 118 కాలనీ లేఅవుట్లలో బోర్‌వెల్స్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని, మిగిలిన 32 లేఅవుట్లలో ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నీటిని అందిస్తున్నారన్నారు. తాత్కాలిక నీటి సరఫరాకు రూ.26.80 కోట్లతో 259 పనులను చేపట్టేందుకు అనుమతి మంజూరు చేసినట్లు చెప్పారు. చేపట్టిన పనులకుగాను ఇప్పటి వరకు రూ.6.06 కోట్లు చెల్లించామన్నారు. ఇంకా మిగిలిన రూ.6.56 కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుత్తేదారులు పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.5.65 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. వారం రోజుల్లో తాత్కాలిక నీటి సరఫరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రజినీ కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ దేవినేని వెంకటరమణ, గుత్తేదారులు బిఎస్ భరద్వాజ, సిహెచ్ కృష్ణదాస్, యం సుభాకర్, వేణు, రాజశేఖర్, పి హరిబాబు, పి సతీష్, ఏపి బిలింగ్ కనెక్షన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి సత్య సుధీర్, సభ్యులు బి.ఎస్ ఎస్‌టి సాయి, తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లింక్ డాక్యుమెంట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురం గ్రామ కాపురస్తులు పొన్నపూల నరసింహారావు తండ్రి నానారావు సంబంధించిన ఆర్ఆర్ఓ దస్తావేజు లింకు డాక్యుమెంట్లు పోయినవి. దస్తావేజు పాస్ పుస్తకం నెంబరు 717729. పట్టా నెంబరు 406. నందిగామ మండలం సత్యవరం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 51/2 నందు య. 1-06 సెంట్లు సర్వేనెంబర్ 52/1 నందు య. 2-32 సెంట్లు వెరసి య. 3.38 సెంట్లు మెట్ట భూమి కలదు. 2023, ఏప్రిల్ 18వ తేదీన రాఘవపురం గ్రామం నుండి నందిగామ గాంధీ సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం బైక్ పై వస్తుండగా దస్తావేజు లింకు డాక్యుమెంట్లు జారిపోయినవి. ఈ దస్తావేజు లింకు డాక్యుమెంట్లపై ఎవరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉంటే తెలియజేయగలరు. వెంటనే సదరు దస్తావేజు లింక్ డాక్యుమెంట్లు దొరికిన వారు 9848206012 సెల్ నెంబర్ కు ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

మొదటి పేజీ తరువాయి

అన్నీ ఆమోదం

కోసం ఛాంబర్లు ఇంటీరియర్ ఫ్లోరింగ్, పెయింటింగ్, విద్యుత్ పరికరాలకు రూ.199 లక్షలు మంజూరయ్యాయి. అయితే ఎయిర్ కండీషనర్లు, వాటికి అవసరమైన వస్తువులను మంజూరైన అంచనాల్లో చూపనందున ఉన్నత స్థాయి అధికారుల సూచనల మేరకు దీనికయ్యే ఖర్చు రూ.49.80 లక్షలను విఎంసి సాధారణ నిధుల నుంచి కేటాయిస్తూ సమావేశం తీర్మానించింది. సర్కిల్-1 పరిధిలోని 48వ డివిజన్ కొండ ప్రాంతం బ్రహ్మంగారి మఠం దగ్గర కళ్యాణ మండపం షెడ్ నిర్మించాలని స్థానిక ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు సూచన మేరకు రూ.31.08 లక్షల అంచనా వ్యయాన్ని విఎంసి సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది. ఇదే డివిజన్ కొండప్రాంతంలోని తమ్మిన పోతురాజు కమ్యూనిటీ హాలుకు మొదటి అంతస్తు నిర్మించాలని ఎంఎల్ఎ సూచన మేరకు రూ.42.45 లక్షల అంచనా వ్యయాన్ని కూడా సాధారణ బడ్జెట్ నుండి చెల్లించాలని నిర్ణయించింది. సర్కిల్-2లోని శ్రీకృష్ణదేవరాయ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 14 షాపుల లీజుకాలాన్ని పొడిగిస్తూ తీర్మానించింది. వాంబేకాలనీ హెచ్ బ్లాక్ కమ్యూనిటీ హాలును మూడేళ్ల లీజుకు రూ.4.48 లక్షలకు ఏకైక టెండర్‌దారుడు కె దుర్గాప్రసాద్ వేసిందున అతనికి కేటాయిస్తూ నిర్ణయించింది. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీ మల్టీపర్పస్ హాలును మూడేళ్ల లీజుకు ఏకైక టెండర్ దారుడు షేక్ నదీమ్ అహ్మద్ జిఎస్‌టిని కలుపుకొని రూ.5.07 లక్షలతో అతనికి కేటాయిస్తూ తీర్మానించింది. పశ్చిమ నియోజకవర్గంలోని కంసాలిపేట, నైజాంగేటు, పాత ఆర్‌ఆర్‌పేట మీదుగా ప్రవహించే అవుట్‌ఫాల్ డ్రైన్లు, మధ్య నియోజకవర్గంలోని పాత ఆర్‌ఆర్‌పేట ఆర్‌సిసి కల్వర్ట్ నుంచి న్యూఆర్‌ఆర్‌పేట రైల్వే గేటుకు సమాంతరంగా ఆర్‌సిసి డ్రైన్ నిర్మాణానికయ్యే రూ.49.50 లక్షల అంచనా వ్యయాన్ని సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తూ స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. ఈసమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు యరడ్ల ఆంజనేయరెడ్డి, బలసాని మణెమ్మ, కుక్కల అనిత, ఉమ్మడి రమాదేవి, వియ్యపు అమర్‌నాథ్‌తోపాటు అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) కెవి సత్యవతి, సిఎంఒహెచ్ డాక్టర్ పి రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల కోట్లకు కెడిసిసిబి టర్నోవర్

తెలిపారు. బ్యాంక్ ద్వారా అందిస్తున్న పారదర్శక సేవలకు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎన్నో అవార్డులు పొందినట్లు చెప్పారు. కెడిసిసిబి మూడు జిల్లాల పరిధిలో పనిచేస్తోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో రుణాలు అందించేందుకు త్వరలో డివిజనల్ క్రెడిట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు విజయవాడ, నందిగామ, నూజివీడు, తిరువూరు కేంద్రాలలో ఈ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారున. అలాగే రికవరీలో కూడా మంచి ప్రగతి సాధించామని తెలిపారు. విదేశీ విద్యకు ఎకరానికి రూ.40 లక్షల వరకు రుణం ఇస్తామని తెలిపారు. అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జిల్లాల్లో ఉన్న 425 సహకార సంఘాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.45 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రతి సహకార సంఘానికి సొంత భవనం ఏర్పాటు చేసి మినీ బ్యాంకుగా మార్చాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా సహకార సంఘాల్లో సభ్యులు చనిపోతే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అదే రోజున ఇస్తున్నట్లు చెప్పారు. గత 20 నెలల కాలంలో బ్యాంక్‌ల్లో వంద ఖాళీలను భర్తీ చేశామని, అలాగే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగోన్నతి కల్పించామని చెప్పారు. సహకార బ్యాంకింగ్ రంగం బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలు అందించడంతో ఇంతటి అభివృద్ధి సాధించ గలిగామన్నారు.

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం.70/2017 ఇన్ ఓ.ఎస్.నెం.246/2016

బిట్వీన్:
బండి వెంకట సుబ్రమణ్యం, తండ్రి:చిన్నారావు, హిందువు, వయస్సు 47 సం॥లు, వ్యాపారం, డోర్.నెం.2/54-ఎ, కాకర్ల వీధి, ఈసేవ దగ్గర, గుడివాడ, కృష్ణాజిల్లా. ...డి.హెచ్.ఆర్
మరియు
1.చలమలశెట్టి శివానందరావు, తండ్రి:(లేటు) నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 60 సం॥లు, ఉద్యోగి, డోర్.నెం.19/147-1, వడ్డే వారి వీధి, బేతవోలు, గుడివాడ, కృష్ణాజిల్లా.
2.చలమలశెట్టి లక్ష్మీనారాయణ, తండ్రి:(లేటు) నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 58 సం॥లు, ఉద్యోగి, కేరాఫ్: తోట వెంకటేశ్వరరావు, డోర్.నెం.26-109ఎ, రామ్‌రాజ్ నగర్, సాయిబాబా గుడి దగ్గర, కబేళా సెంటర్, విజయవాడ, కృష్ణాజిల్లా.
3.సమ్మెట సీతామహాలక్ష్మి, భర్త:సుబ్బారావు, హిందువు, వయస్సు 55 సం॥లు, గృహిణి, డోర్.నెం.26-109ఎ రామ్‌రాజ్ నగర్, సాయిబాబా గుడి దగ్గర, కబేళా సెంటర్, విజయవాడ, కృష్ణాజిల్లా.
4.చలమలశెట్టి శేషుబాబు, తండ్రి:(లేటు) నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 52 సం॥లు, ఉద్యోగి, డోర్.నెం.19/147-1, వడ్డే వారి వీధి, బేతవోలు, గుడివాడ, కృష్ణాజిల్లా.
5.చలమలశెట్టి వెంకటేశ్వరరావు, తండ్రి:(లేటు) నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 50 సం॥లు, ఉద్యోగి, డోర్.నెం.19/147-1, వడ్డే వారి వీధి, బేతవోలు, గుడివాడ, కృష్ణాజిల్లా. ...జె.డిఆర్స్

పై నెంబరు డిక్రీ బాకీ, ఖర్చులు వగైరాల క్రింద జె.డి.ఆర్స్ తాలూకా ఇ.పి. షెడ్యూలు తాలూకా స్థిరాస్తిని జప్తు చేయమని కోరుచూ డి.హెచ్.ఆర్ పై నెంబరు ఇ.పి.దాఖలు చేసినందున సదరు విషయమై 1 టు 4 జె.డి.ఆర్.లకు ఆర్డర్ 21 రూల్ 64 నోటీసు నిమిత్తం ది.12-05-2023వ తేదీన వాయిదా వేయబడివున్నది. సదరు విషయమై 1 టు 4 జె.డి.ఆర్.లకు ఏమైనా అభ్యంతరములు వున్న యెడల వాయిదా తేదీ ఉదయం గం॥10-30 ని॥లకు పై కోర్టు వారి యెదుట 1 టు 4 జె.డి.ఆర్‌లు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపవలెను. లేని యెడల తదుపరి ఉత్తర్వులు జారీ చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా:12-05-2023
గుడివాడ,
తేదీ:27-04-2023.

ఇట్లు
పఠాన్ బాజీ షరీఫ్‌ఖాన్,
అడ్వకేట్,
గుడివాడ, కృష్ణాజిల్లా.

IN THE COURT OF THE MVACT CUM CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD

M.V.O.P. No. : **2315 of 2022**

Between:
Abdul Vazuruddin ...Petitioner
AND
Geo Fast Carriers Pvt Ltd and others ...Respondents

To, Respondent No.1
Geo Fast Carriers Pvt Ltd. Rep by Mahender Gurram, Occ : Driver, R/o: Nagamani Floor No.1, Yadhavula Street, Vijayawada Urban, Krishna District - 521 137.

Please take notice that the Petitioner had filed the above, Case for grant of compensation for the Injuries sustained in a Motor Vehicle Accident which occurred on 23-11-2022 under the limits of-P.S. Kanchikacherla.

The above case is posted to **23-06-2023** at **10-30** AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in Person or through an Advocate, else the Case will be decided Exparte.

(BY ORDER OF THE COURT)
K. ANAND REDDY
D.VENKAT RAMANA
Counsels for the Petitioner
Office : Flat No.212, Jamuna Towers, Opp. Yashoda Hospital, Malakpet, Hyderabad-500 036.
Cell : 9848052455, 9848051707

విమానాశ్రయం కారిడార్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ

విమాశ్రయం కారిడార్ పనులను త్వరగా పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జాతీయ రహదారి వెంట చేపడుతున్న గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ పనుల నాణ్యతను శనివారం ఆయన పరిశీలించారు. అధికారుల వద్ద నుంచి వివరాలు అడిగి తెలుసుకొని పలు ఆదేశాలు జారీ చేశారు. రామవరప్పాడు రింగు, ప్రసాదంపాడు వద్ద జరుగుతున్న కారిడార్ పనులలో వినియోగిస్తున్న మోడల్ ఫ్లోరింగ్ టైల్స్ ఆకర్షణీయంగా కనిపించే రీతిలో ఉండాలని సూచించారు. రోడ్డు ప్రక్కన ఉన్న షాపుల ముందు వేసిన ర్యాంపులు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలన్నారు.

IN THE COURT OF 2nd ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.174/2023 in I.P. 79/2013

BETWEEN :
Nadella Lakshmi,
w/o Late Venkateswara Rao, Hindu,
aged about 48years, R/o.24-9/1-47,
Rama Nagar, Satyanarayanapuram,
Vijayawada. ...Petitioner
And
B.Kesava Rao and others ...Respondent
To
B.Kesava Rao,
S/o Vijaya Raghava Rao, Hindu,
aged about 50 years, R/o. Mahantipuram,
Vijayawada. (1st Respondent)

పై నంబర్ వ్యాజ్య గ్రంథము నందు మొదటి Respondent అయిన B.కేశవరావుకు కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారి వుత్తర్వులను అనుసరించి ఈ ప్రకటన ద్వారా నోటీస్ జారీ చేయటమైంది. కావున B.కేశవరావు తేదీ:01-05-2023 న కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.లేని యెడల శ్రీ కోర్టు వారు ఈగ్రంథమును మీ పరోక్షమున చట్టప్రకారం పరిష్కరిం చెదరని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
వాయిదా తేదీ:01-05-2023
విజయవాడ.
తేదీ : 29-04-2023.

ఇట్లు
Naqeeb Ahmed
Advocate,
Vijayawada,
Cell : 9490056786

IN THE COURT OF 2nd ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.176/2023 in I.P. 79/2013

BETWEEN :
Nadella Lakshmi,
w/o Late Venkateswara Rao, Hindu,
aged about 48years, R/o.24-9/1-47,
Rama Nagar, Satyanarayanapuram,
Vijayawada. ...Petitioner
And
B.Kesava Rao and others ...Respondent
To
B.Kesava Rao,
S/o Vijaya Raghava Rao, Hindu,
aged about 50 years, R/o. Mahantipuram,
Vijayawada. (1st Respondent)

పై నంబర్ వ్యాజ్య గ్రంథము నందు మొదటి Respondent అయిన B.కేశవరావుకు కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారి వుత్తర్వులను అనుసరించి ఈ ప్రకటన ద్వారా నోటీస్ జారీ చేయటమైంది. కావున B.కేశవరావు తేదీ:01-05-2023 న కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.లేని యెడల శ్రీ కోర్టువారు ఈ గ్రంథమును మీ పరోక్షమున చట్ట ప్రకారం పరిష్కరిం చెదరని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
వాయిదా తేదీ:01-05-2023
విజయవాడ.
తేదీ : 29-04-2023.

ఇట్లు
Naqeeb Ahmed
Advocate,
Vijayawada,
Cell : 9490056786

IN THE COURT OF 2nd ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.175/2023 in O.R.I.P.6/2019 in I.P. 79/2013

BETWEEN :
Nadella Lakshmi,
w/o Late Venkateswara Rao, Hindu,
aged about 48years, R/o.24-9/1-47,
Rama Nagar, Satyanarayanapuram,
Vijayawada. ...Petitioner
And
Official Receiver, Krishna, Machilipatnam
and Others ...Respondent
To
B.Kesava Rao,
S/o Vijaya Raghava Rao, Hindu,
aged about 50 years, R/o. Mahantipuram,
Vijayawada. (2nd Respondent)

పై నంబర్ వ్యాజ్య గ్రంథము నందు రెండవ Respondent అయిన B.కేశవరావు కు కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారి వుత్తర్వులను అనుసరించి ఈ ప్రకటన ద్వారా నోటీస్ జారీ చేయటమైంది. కావున B.కేశవరావు తేదీ:01-05-2023 న కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.లేని యెడల శ్రీ కోర్టువారు ఈ గ్రంథమును మీ పరోక్షమున చట్టప్రకారం పరిష్కరిం చెదరని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
వాయిదా తేదీ:01-05-2023
విజయవాడ.
తేదీ : 29-04-2023.

ఇట్లు
Naqeeb Ahmed
Advocate,
Vijayawada,
Cell : 9490056786

IN THE COURT OF 2nd ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.177/2023 in O.R.I.P.6/2019 in I.P. 79/2013

BETWEEN :
Nadella Lakshmi,
w/o Late Venkateswara Rao, Hindu,
aged about 48years, R/o.24-9/1-47,
Rama Nagar, Satyanarayanapuram,
Vijayawada. ...Petitioner
And
Official Receiver, Krishna, Machilipatnam
and Others ...Respondent
To
B.Kesava Rao,
S/o Vijaya Raghava Rao, Hindu,
aged about 50 years, R/o. Mahantipuram,
Vijayawada. (2nd Respondent)

పై నంబర్ వ్యాజ్య గ్రంథము నందు రెండవ Respondent అయిన B.కేశవరావు కు కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారి వుత్తర్వులను అనుసరించి ఈ ప్రకటన ద్వారా నోటీస్ జారీ చేయటమైంది. కావున B.కేశవరావు తేదీ:01-05-2023 న కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.లేని యెడల శ్రీ కోర్టువారు ఈ గ్రంథమును మీ పరోక్షమున చట్టప్రకారం పరిష్కరిం చెదరని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
వాయిదా తేదీ:01-05-2023
విజయవాడ.
తేదీ : 29-04-2023.

ఇట్లు
Naqeeb Ahmed
Advocate,
Vijayawada,
Cell : 9490056786

నృత్యప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

ఘనంగా నృత్య దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -మొవ్వ

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిఎ విద్యార్థులు నాట్యానికి అధిదేవుడు శ్రీ నటరాజ స్వామి విగ్రహానికి సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నాట్య ప్రదర్శనలతో నృత్య నీరాజనాలు అర్పించారు. శ్రీ బాలాత్రిపురసుందరి గ్రంథాలయ పాలకులు వైవి ఫణికుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం అధ్యాపకులు డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు ,డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, పసుమర్తి హరినాథ్‌శాస్త్రి, వేదాంతం వెంకట దుర్గా భవాని, కళాపీఠం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ అంకమ్మ తల్లి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలోని శ్రీ అంకమ్మ తల్లి వార్షిక బ్రహ్మోత్సవాలను

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బుద్ధప్రసాద్, వెంకట్రామ్

అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మ వారికి గ్రామ పొంగళ్లు, నైవేద్యాలు, కుంభం పోయుటతో పాటు భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. మూడు రోజులు పాటు జరిగిన ఉత్సవాల్లో మొదటి రోజైన గురువారం గ్రామంలోని శ్రీ పోతురాజు స్వామి, గంగానమ్మ తల్లి, సీతల దేవి అమ్మవార్లకు అభిషేకాలు, పొంగళ్లు సమర్పించారు. రెండోరోజైన శుక్రవారం అమ్మవారికి పంచామృతాలు, అభిషేకం, మహిళలచే సామూహిక కుంకుమార్చన, చండీ, రుద్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు బాల జగన్నాథ నాగేశ్వరరావు శాస్త్రోక్తంగా అమ్మవారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.

బీచ్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో శనివారం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంటుమిల్లి మండలం మణిమేస్వరం గ్రామానికి చెందిన కటారి బోగేశ్వరరావు కుమారుడు కటారి విశ్వేశ్వర కుమార్ తన వైవాహిక జీవితంలో ఏర్పడిన సమస్యల కారణంగా మంగినపూడి బీచ్ లో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేశాడు. బీచ్‌లో పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న మెరైన్ హెడ్ కానిస్టేబుల్ జి.భరతరాజు,హోంగార్డు పి.స్వామి, తాలూకా అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డే బీట్ సిబ్బంది వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, అబ్దుల్ రహీంలు గమనించి రక్షించారు. మణిమేశ్వరంలో ఉన్న వారి బంధువులకు సమాచారం అందజేయగా వారు వచ్చి తీసుకెళ్లారు. మెరైన్ సీఐ ఎం.శ్యామ్ కుమార్, ఎస్ఐ చంద్ర బోస్, తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ చాణక్య సిబ్బందిని అభినందించారు.

నిరసనలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

బిజెపి నేత శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కుస్తీ యోధుల పై రెజ్లింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, బిజెపి అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ వచ్చిన లైంగిక వేధింపులు ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం కోనేరు సెంటర్ లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కె వి పి ఎస్ జిల్లా అద్యక్షులు సి హెచ్ రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో భారత్ కు పతకాలు సాధించిన మహిళా కుస్తీ యోధులపై రెజ్లింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, బిజెపి అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధిత మహిళలు చెబుతున్నప్పటికీ ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. సి ఐ టి యు జిల్లా అద్యక్షులు చౌటు పల్లి రవి మాట్లాడుతూ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌నుపదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన అధికార పార్టీ ఎంపి కాబట్టి దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. ఓ మహిళ అయ్యుండి తోటి మహిళా రెజ్లర్ల సమస్యను ఉష పట్టించుకోలేకపోతున్నారన్నారు. గతంలో తన అకాడెమీ విషయంలో ఉష స్వయంగా మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మల్లయోధుల నిరసన క్రమశిక్షణారాహిత్యంతో కూడుకుందనీ, దేశ ప్రతిష్టను దిగజార్చిందనీ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, ఎంపి పిటి ఉష చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ, ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు కె.విజయ లక్ష్మి, సి ఐ టి యు, జిల్లా ఉపాధ్యక్షులు బి.సుబ్రమణ్యం,పట్టణ కార్యదర్శి సి హెచ్ జయ రావు, టి.చంద్ర పాల్, చాందినీ,యునస్ పాల్గొన్నారు.

వేలంపాటల్లో రూ.92,580 ఆదాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలోని శ్రీలంకమ్మ అమ్మవారి వార్షిక జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన ఘటం బిందెలు చీరలు బియ్యం వేలం వేయగా రూ.92,580 ఆదాయం లభించినట్లు ఆలయ ఇఒ పి.సీతారామయ్య తెలిపారు. శనివారం ఆలయం వద్ద నిర్వహించిన బహిరంగ వేలంలో 1550 క్వింటాళ్ల బియ్యానికి వేలం నిర్వహించగా ఇందులో రూ.5 వేల చొప్పున డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనగా కేజీ 17.60 పైసలు చొప్పున అలపర్తి గోపాలకృష్ణమూర్తి పాటను కైవసం చేసుకున్నారు.ఇందుకుగాను రూ.27,280 ఆదాయం లభించినట్లు చెప్పారు. ఘటం బిందెలకు రూ.18,550 చీరలకు రూ.46,750 ఆదాయం లభించినట్లు చెప్పారు. మచిలీపట్నం దేవాలయాల తనిఖీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు, ఆలయ సిబ్బంది, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ పక్కాల అంజిబాబు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల

చిన్ననాటి నుంచే విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించటం ద్వారా మంచిగా రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముళ్ళపూడి గ్రామ సర్పంచ్ పక్కాల అంజిబాబు పిలుపునిచ్చారు. పమిడిముక్కల మండలంలోని ముళ్ళపూడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అమ్మఒడి, వసతిదీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబు, వేల్పూరు మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి బోసుబాబు, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరపల్లి కోటయ్య, ఐనంపూడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు సారథి, సరళ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాగిత వెంకట్రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-పెడన

మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు కాగిత వెంకట్రావు ద్వితీయ వర్ధంతి కార్యక్రమం శనివారంనాడు పెడన సబ్ రిజస్ట్రార్ ఆఫీస్ భవన సముదాయంలోని పెడన నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం పెడన మండల అధ్యక్షులు వీరంకి శ్రీనివాసరావు నేతృత్వంలో నివాళులర్పించారు. బీసీ నాయకులు, కార్యకర్తలు కాగిత వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు

నివాళులర్పిస్తున్న కృష్ణప్రసాద్

లర్పించారు. శివజ్యోతి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు, పేదలకు మామిడి పండ్లు పంపిణీ చేశారు. పెడనలో కాగిత వెంకట్రావు విగ్రహం ఏర్పాటుచేస్తామనీ, ఆయన జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావటానికి కృషిచేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పామర్తి వెంకటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాగిత శంకర సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు పోలగాని లక్ష్మీనారాయణ, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చండిక హరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి వేముల వెంకట ప్రసాద్, జిల్లా కార్యదర్శి బొల్లా నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి పోలగాని రాంబాబు, బీసీ నాయకులు సత్యనారాయణ మూర్తి, ప్రత్తిపాటి ఈశ్వరుడు, చంద్ర తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు కాగిత వెంకట్రావు రెండోవర్ధంతి సభ జరిగింది. కాగిత వెంకట్రావు చిత్రపటానికి పెడన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా కాశీ, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బోల్లా వెంకన్న, పార్లమెంట్ టిఎన్‌టియుసి అధ్యక్షులు సింగంశెట్టి శ్రీను, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అంగర రంగనాథ్, క్లస్టర్ సూరిబాబు, యూనిట్ ఇన్‌ఛార్జిలు జె.కొండ, బడుగు వెంకటేశ్వరరావు, రేవు గోపాలకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ కట్టా స్వామి, జరీనా, నూర్ అక్బర్, సుధాకర్, యార్లగడ్డ శ్రీను, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డిఎస్‌పిపై ఎందెకంత అక్కసు : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నం డిఎస్‌పి మాసూం భాషని మంత్రి జోగి రమేష్ పబ్లిక్‌గా బెదిరించి దుర్భాషలాడడాన్ని మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి మైనార్టీలు అంటే ఎందుకు అంత కక్షో చెప్పాలన్నారు. మైనార్టీలంతే అంత చులకనగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. మైనార్టీలంతా ముక్తకంఠంతో ఈ చర్యను ఖండిస్తున్నారన్నారు. వైసిపి పార్టీకి పూర్తిగా బద్ధుడై పనిచేస్తున్న డి.ఎస్.పి మాసూం బాషా పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగిలిన మైనార్టీ ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తక్షణమే మాసూం భాషకు క్షమాపణలు చెప్పాలని లేకుంటే జోగి రమేష్ కు , వైసిపి ప్రభుత్వానికి మైనారిటీలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు ఇలియాస్ పాషా, కార్యదర్శి కాంతారావు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు ఫిరోజ్ , మైనార్టీ నాయకులు, మాజీ హాస్పిటల్ డైరెక్టర్ అబ్దుల్ అజీమ్, బాజాని, అమీర్, తెలుగు యువత అధ్యక్షుడు సలీం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీ లాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం కేంద్ర ఫుడ్ ప్రాసెస్సింగ్ పరిశ్ర మలు, జలశక్తి శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ శనివారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వీరికి వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేయగా, శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం,, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఎల్‌బిఆర్‌సిఇ అధ్యాపకురాలికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న అధ్యాపకురాలు అరుణకు పిహెచ్‌డి ప్రధాన మైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు శనివారం తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ సెన్సార్ విత్ ఫిల్మ్ కోటింగ్ ఫర్ ఎన్విరాన్మెంటల్ అప్లికేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పిహెచ్‌డిని ప్రధానం చేశారన్నారు. ఈ పరిశోధన ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ బి రామకష్ణ పర్య వేక్షణలో జరిగిం దన్నారు. కళాశాల ప్రెసిడెంట్ శ్రీని వాస్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ రామిరెడ్డి, అధ్యా పకులు అధ్యాపకేతన సిబ్బంది అరుణను అభినందించారు.

స్ఫూర్తి ఆధ్వర్యంలో 1న విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా మానవులాంతా ఒకటే అనే నినాదాన్ని తెలియచేయాలనే ఉద్దేశంతో స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలులోని స్ఫూర్తి దామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కె.ఎల్. విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పైడిపాటి ఉమానాథ శర్మ తెలిపారు. మొగల్‌రాజపురంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ విశ్వస్ఫూర్తి వారి లక్ష్యం సాకారమవ్వాలనే ఉద్దేశంతో వారి జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్కరూ సమానమనే భావాన్ని తెలియచేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రెండు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలియచేశారు. స్ఫూర్తి కుటుంబం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఎ.రాజేష్ మాట్లాడుతూ మే 1వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జ్ఞానవంతులు కావాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, ఎం.రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం అవసరం

- ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీలో కలెక్టర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సంపూర్ణమైన ఆరోగ్యం ఉన్నప్పుడే విద్యార్థులు విద్యపై శ్రద్ధ చూపుగలుగుతారని విద్యార్థులలో రక్త హీనతను నివారించేందుకు అందించే ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను పిల్లలకు క్రమం తప్పకుండా అందించేందుకు తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు కోరారు. స్థానిక పటమటలంక కెఎస్‌ఆర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. విద్యార్థినిలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి అనీమియా శాతాన్ని నమోదు చేసి రక్తహీనతను నివారించేందుకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి గురువారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం ఐరన్ మాత్రలు తీసుకునేలా ఉపాధ్యాయులు నిశితంగా పరిశీలిం

మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

చాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన మాత్రల ఫలితంగా విద్యార్థులలో రక్తహీనత శాతం క్రమంగా పెరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారిణి సివి రేణుక, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. యం సుహాసిని, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. జి. మాధవి, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కెవి ఎల్ ఎన్ కుమార్, డిప్యూటి డిఇవో కొండ రవికుమార్, ఎస్ పి హెచ్‌వో నరసింహానాయుడు, పిహెచ్‌సి డా. మోబిన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. పద్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి మైలవరం : మండలంలోని కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సకహార సంఘం లో శనివారం 2022 డిసెం బర్ నుండి 2023 డిసెం బర్ వరకు 270 మంది పాల ఉత్పత్తి దారులకు రూ.5,53,164 లు ధర వ్యత్యాస బోనస్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పుల్లూరు పిఎసిఎస్ అధ్యక్షులు చిలుకూరు రామిరెడ్డి, మైలవరం క్లస్టర్ విజయవాడ పాల ఫ్యాక్టరీ మేనేజర్ తుమ్మల యశ్వంత్ లు మాట్లాడుతూ మూడు సంవత్సరాలు పాలు పోసి అర్హత సాధించిన వారికి కళ్యాణమస్తు, క్షీర బందు పథకాలను జిల్లా యూనియన్ వారు అమలు చేస్తున్నారన్నారు. పాలు పోసే రైతులకు విత్తనపు గడ్డి ఘనపులను ఉచితంగా అందజేస్తున్నా మన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పరిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబి రెడ్డి,వీఎంసి సూపర్వైజర్ గోపికష్ణ, సంఘ వేతన కార్యదర్శి వెంకటరెడ్డి,పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన డిజిటల్ అసిస్టెంట్‌ను కఠినంగా శిక్షించాలి : వీఆర్‌ఒలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం చందాపురం గ్రామ రెవెన్యూ అధికారి పెనుమూరు బాబురావుపై దాడి చేసిన డిజిటల్ అసిస్టెంట్ వెంకటరాజును కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరుతూ నందిగామ వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డిఓ ఏ రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. వెంకట రాజుపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని, తక్షణమే విధుల నుంచి తొలగించాలని వీఆర్వోల సంఘం అధ్యక్షులు వెలగా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వీఆర్వో సంఘ నాయకులు లీలా ప్రసాదు, విఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

'ఆయుష్'లో విజయవంతంగా ఎముకల శస్త్రచికిత్స

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ : ఆయుష్ హాస్పటల్స్ ఏలూరులో క్లిష్టమైన ఎముకల శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆయుష్ హాస్పటల్ ఎముకలశస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాల వయసుగల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో శరీరంలో పలు చోట్ల ఎముకలు విరగడంతో ఏలూరులోని ఆయుష్ హాస్పటల్స్‌కు తీసుకువచ్చారన్నారు. అతనికి కుడి ముంజేయి, చేతికి ఎడమ మణికట్టు,చేతికి కుడి మోకాలుకు, కాలిగి గాయాలయ్యాయని అన్నారు. ఆవ్యక్తికి మొదట ఎటిఎల్‌ఎస్ యొక్క మార్గదర్శకాల ఆధారంగా ప్రథమ చికిత్స చేసి అతని ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరచినట్లు తెలిపారు. తరువాత అతనికి పలు రకాల విరిగిన ఎముకలను ఒకే సర్జరీలో తిరిగి అతికించడానికి ఒక కాంప్లెక్స్ సర్జరీ పద్ధతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈపద్ధతిలో అతనికి ఉన్న అన్ని విరిగిన ఎముకలరకే అనగా రెండు ముంజేయి ఎముక ఫ్రాక్చర్లు, రెండు చేతులకు మల్టీమెటా కార్పల్ ఫ్రాక్చర్లు, డిజిటల్ రేడియస్ ఫ్రాక్చర్, రెండు కాళ్లకు విరిగిన ఎముకలకు ఒకేరోజులో శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు.

నైట్ షెల్టర్ పరిశీలన

ప్రజాశక్తి - భవానీపురం : అనాధలైన వద్ధులకు నైట్ షెల్టర్ ద్వారా ఆశ్రయం కల్పించడం అభినందనీయమని 44 వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. శనివారం 44వ డివిజన్ సొరంగం వద్ద నగరపాలక సంస్థ యుసిడి విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైట్ షెల్టర్ ను రత్నకుమారి పరిశీలించారు. నైట్ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వద్ధులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ఎవరూ లేని వద్ధులు, తమ బాగోగులను పిల్లలు పట్టించుకోకుంటే బయటకు వచ్చేసిన వారికి నైట్ షెల్టర్ ఆశ్రయం కల్పించడం అభినందనీయమని అన్నారు. యూసిడి ప్రాజెక్టు ఆఫీసర్ కె.శకుంతల, వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, నైట్ షెల్టర్ ఇంచార్జ్ మమత పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని బూదవాడ గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అన్నిచోట్ల నుండి విశేష స్పందన లభించిందన్నారు. బుదవాడ గ్రామ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ అపహాస్యం

వీక్షణం

విపక్షాలను అదిరించడం, బెదిరించడం, అదీ కాకపోతే ఎదురుదాడికి దిగి తానను కున్నది కానిచ్చేసుకోవడమే కౌన్సిల్‌లో అధికార వైసిపి వైఖరిగా తయారయింది. ఎంతో ప్రాధాన్యత కల్గిన అజెండా లోని అంశాలపై ఎటువంటి చర్చకు తావివ్వకుండానే ముందస్తుగా అనుకున్న వ్యూహం ప్రకారం .."ఎస్" ఆర్ "నో" అనే అప్రజాస్వామిక పద్ధతిలో అధికారపక్షం కౌన్సిల్‌ను నడుపుతున్న తీరు రాజకీయపక్షాల నుంచే గాక నగర వాసుల నుంచి తీవ్ర విమర్శలకు దారి తీసింది. ప్రధాన ప్రతిపక్ష టిడిపి కౌన్సిల్‌లో తాను గతంలో వ్యవహరించిన తీరు, చేసిన పొరపాట్లు, తప్పిదాలను ఎత్తి చూపుతూ, వాటినే ఆయుధాలుగా చేసుకొని, ప్రస్తుత అధికార వైసిపి అడ్డూ అదుపు లేకుండా ఇష్టారాజ్యంగా కౌన్సిల్‌ను నడుపుతూ ప్రజలకు నష్టం కల్గించే, నగరాభివృద్ధి కుంటుపడే నిర్ణయాలు చేసుకుంటూ పోతోందనడానికి గురువారం జరిగిన నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించిన తీరే తేటతెల్లం చేస్తుంది. పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం లేబర్ కాలనీలోని లేబర్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన ఒక ఎకరం పది సెంట్ల స్థలాన్ని అధికార వైసిపి కార్యాలయానికి కేటాయిస్తూ ఎటువంటి చర్చకు తావివ్వకుండా కౌన్సిల్‌లో తీర్మానం చేసింది. ఏడాదికి రూ. వేయ్యి అద్దె చొప్పున 33 ఏళ్లపాటు లీజు పద్ధతిలో తీసుకున్న నిర్ణయం పట్ల విపక్ష టిడిపి, సిపిఎం కౌన్సిల్‌లో భగ్గుమన్నాయి. ఎంతో విలువైన ఈ స్థలాన్ని ప్రజా ఉపయోగ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు కౌన్సిల్‌లో చేసిన ఆందోళన చివరకు అరణ్యరోదనగానే మిగిలిపోయిందని చెప్పక తప్పదు. ప్రతిపాదనలు అజెండాలోకి తీసుకొచ్చిన విధానం కానీ, విపక్షాలను బయటకు పంపించి 88కె పేరుతో (అత్యవసరమైన) సమావేశం మధ్యలోనే హడావుడిగా తీసుకొచ్చిన అంశాలను ఆమోదించు కున్న తీరు మునిసిపల్ నిబంధనలు పరిగణలోకి తీసుకున్న పరిస్థితి లేకుండా పోయింది. 53 అంశాలతో కూడిన ప్రధాన అజెండాతో పాటు సప్లమెంటరీ అజెండానే కాకుండా, మరో 18 అంశాలపై 88కె కింద రెండో కంటికి కూడా తెలియకుండా హడావుడిగా ప్రతిపాదనల రూపంలో తీసుకొచ్చి ఆమోదించుకున్న తీరు కౌన్సిల్ అపహస్యం పాలయిందని చెప్పక తప్పదు. అత్యవసరంగా అప్పటికప్పుడు ప్రవేశపెట్టాల్సిన అవసరం లేకపోయినా, సమగ్రంగా చర్చించి, నిర్ణయం చేయాల్సిన అంశాలను సైతం ఎటువంటి చర్చకు తావివ్వకుండానే అత్యంత గోప్యంగా తీసుకొచ్చి ఆమోదించేశారు. వీధి పేర్ల దగ్గర నుంచి వే బోర్డుకు అనుమతి కోసం, సిఆర్‌డిఎ ఆఫీసు ఎదురుగా ఉన్న పార్కులో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం ప్రతిష్టించాలని, సాంబమూర్తి రోడ్డు గులాబితోట ఆర్‌టిసి బస్టాండ్ పక్కన మాజీ కార్పొరేటర్‌బొప్పన రాఘవేంద్రరావు విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని పెట్టిన ప్రతిపాదనలు 88కె కింద తీసుకొచ్చినవి కావడం గమనార్హం. ఇలాగే అనేక అంశాలను తీసుకొచ్చారు. రెండో కంటికి కూడా తెలియకుండా ఆమోదించేసుకున్న తీరు విమర్శలకు దారితీసింది. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఆగిపోయిన ప్రజాసమస్యలు పరిష్కరించకుంటే ప్రజల నుంచి తీవ్ర విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తోందని స్వయంగా పలువురు స్వపక్ష సభ్యులే ఆందోళన వ్యక్తం చేస్తూ మాట్లాడిన తీరు, కుంటుపడిన వైసిపి పాలనకు అద్దంపడుతుందని చెప్పక తప్పదు. ఆగిపోయిన అభివృద్ధి పనులు, నిధుల సమస్య, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన వందల కోట్ల నిధులు, పెండింగ్ సమస్యలు, వీటన్నింటిపై సమగ్రమైన చర్చించాల్సిన కౌన్సిల్ ఆదిశగా మచ్చుకైనా చర్చకు నోచుకోకపోవడం గమనార్హం.

వి.హెచ్.రాజు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.